# దేవుని చదరంగం

## - రావిపల్లి నారాయణరావు

అగ్రహారం వీధిలో నాలుగు గదుల అపార్టుమెంట్ ఒకటి నాలుగేళ్ళకిందట స్వంతం చేసుకున్నారు రమణయ్యగారు. సముద్రం వైపు చూచి ఆనందించడం అన్నా, సముద్రపు హోరు గాలిలో ఎగిరే పంచను సర్దుకుంటూ నడవటం అన్నా రమణయ్యగారికి మహా సరదా. ఆయనతో కలసి జీవించేవాళ్ళు ఎవరూ ప్రస్తుతం ఆ ఇంట్లో లేకపోవడంతో అంత పెద్ద ఇంట్లో తనొక్కడే ఉంటే బోరుకొడుతుందనో, లేక ఒక చిన్న పోర్షన్ అద్దెకిస్తే వచ్చేవాళ్ళు తనకు తోడుగా ఉంటారనో రమణయ్యగారు 'టులెట్' అన్నకాలం కింద స్థానిక పేపర్లో తన ఇంటి గురించి ప్రకటన వేయించారు. ఉద్యోగరీత్యా బదిలీమీద విశాఖ పట్నం వచ్చిన నేను పేపర్లో ఆ ప్రకటన చూడ్డం యాదృచ్ఛికంగా జరిగింది. ఆలశ్యం అమృతం విషం అన్న నానుడి జ్ఞప్తికి తెచ్చుకుని ఆ సాయంత్రమే పేపర్లోని కటింగ్ జేబులో పెట్టుకుని ఆఫీసు విడిచిపెట్టగానే అగ్రహారం వీధి చేరుకున్నాను. ఆ వీధి చివరనున్న సాగర్ టవర్స్ నాలుగో అంతస్తులో స్టెయిర్‌కేస్ ఎదురుగా గోడకు వ్రేలాడే బోర్డులో 'రమణయ్య - ఇన్' అన్న అక్షరాలపై నా దృష్టి పడగానే - 'కౌన్ బనేగా కరోర్ పతి'లో అమితాబచ్చన్ అడిగిన మొదటి ఐదు ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పి సునాయాసంగా పదివేల చెక్కు పాకెట్లో పెట్టుకు వచ్చినంత ఆనందంగా ఫీలయ్యాను. ఎందుకంటే, పారిశ్రామిక పట్టణంగా రూపొందిన వైజాగ్‌లో ఇల్లు అద్దెకు దొరకటం జాక్‌పాట్ కొట్టడం లాంటిదే. వెళ్ళగానే ఇంటి ఓనర్ని కలిసే అవకాశం లభించడం ఒక గొప్ప విశేషమే మరి. కాలింగ్‌బెల్ రింగ్ వినబడగానే తలుపుతీసి బయటకు వచ్చారు రమణయ్యగారు. నా రాకకు కారణం తెలుసుకుని ఆయన నన్ను నఖశిఖ పర్యంతరం చూశారు. నేనతని కంటికి ఎలా కనిపించానో తెలియదు కాని, ఆయన మాత్రం నాకు మనసున్న మనిషిలా కనిపించారు. నాతో ఎంతో చనువుగా మాట్లాడారు. లోపలికి తీసుకెళ్ళి ఖాళీగా ఉన్న పోర్షన్ చూపించారు. పైనున్న టెర్రేస్ మీదకు తీసుకెళ్ళి కన్నుల పండుగ్గా కనిపించే విశాఖపట్టణాన్ని చూడమన్నారు. అల్లంత దూరాన రకరకాల దుస్తుల్లో కబుర్లు చెప్పుకునే జంటలు, ఆనందంగా కాలం గడుపుతున్న నూతన దంపతులు, ఇసుక దిబ్బల మీద పరుగులెడుతూ కేరింతలు కొట్టే పసిపిల్లలు, ఐస్‌క్రీమ్ బండి చుట్టూ గుమిగూడిన పిన్నలు, పెద్దలు, కాళ్ళీడ్చుకుంటూ కాలక్షేపానికొచ్చిన వయోవృద్ధులతోను - మనస్సుని ఆహ్లాదపరిచే బీచ్‌ని చూపించారు చెప్పారు. ఆ టెర్రేస్ మీద ఆయన, నేను చాలాసేపు కూర్చున్నాం. అలా కూర్చున్న అరగంట టైములో మా ఇద్దరి మధ్య జరిగిన సంభాషణలో ఎన్నో విషయాలు దొర్లాయి. ఒక ప్రయివేటు కంపెనీలో మేనేజర్‌గా ఉద్యోగం చేసిన రమణయ్యగారు పదవీ విరమణ చేసి తొమ్మిది సంవత్సరాలు గడిచాయి. ఆయన భార్య పదేళ్ళ కిందట కన్నుమూసింది. ఆయన ఇద్దరు కొడుకుల్లో ఒకడు అమెరికాలోను మరొకడు ఇంగ్లండులోను ఉన్నారు. అల్లుడు, కూతురు విశాఖపట్నం షిప్‌యార్డ్ క్వార్టర్స్‌లో కాపురం ఉంటున్నారు. అలవాట్ల గురించి మాట్లాడినప్పుడు రమణయ్యగారు, నేను ఒకే బోట్లో ప్రయాణం చేస్తున్నట్టు అనిపించింది. సాధారణంగా హాబీలు - అదే అలవాట్లు లేని మనిషి ఉంటాడా?.... ఆ మాటకొస్తే ఈ హాబీలు మనుషులకే పరిమితం కావు. జంతువులకు కూడా హాబీలుంటాయని మా తాతగారు అప్పుడప్పుడు చెబుతుండేవారు. మనదేశంలోనే కాదు, ప్రపంచంలో ఎంతోమంది పెద్దలు, పిల్లలు, స్త్రీలు, పురుషులు క్రికెట్ కామెంటరీ వినటానికి



రేడియో సెట్ల దగ్గర, టీవీ సెట్ల ముందు సెటిలైపోవడం ఒక హాబీ అయిపోయిందీనాడు. నాకు మాత్రం, నిజం చెప్పాలంటే, యీ ఆటల మీద ఆసక్తి లేదు. నేనెప్పుడూ క్రికెట్ బ్యాట్ పట్టుకోలేదు. చదువుకునే రోజుల్లో కూడా స్నేహితులు బలవంతం చేసినా ఏ ఆటల్లోను పాల్గొనలేదు. అయితే నాకున్న ఒకే ఒక్క హాబీ పాటలు విని ఆనందించటం. రెండు మూడు దశాబ్దాల కిందట విడుదలైన సినిమా పాటలు వినటానికి నా మనసెప్పుడూ ఉవ్విళ్ళూరుతుంటుంది. అలాంటి పాటలు చెవిని పడితే నా కాళ్ళు ముందుకు పోవు. పాట పూర్తయ్యే వరకూ అక్కడ నుంచి కదలడానికి నా మనస్సు ససేమిరా ఒప్పుకోదు.

"ఇల్లు చూడ్డం అయింది కదా, నచ్చలేదా?" అడిగారు రమణయ్యగారు.

ఆ ఆలోచనల్లోపడి నా ఉనికినే మరచిపోయిన నేను రమణయ్యగారు వేసిన ప్రశ్నకు యీ లోకంలోకి వచ్చాను.

బాగా చీకటి పడింది. అప్పుడే వెలిగిన విద్యుద్దీపాల కాంతుల్లో ఆ ఇంటి చుట్టూ చోటు చేసుకున్న ప్రదేశం ప్రశాంతంగా కనిపించింది. అయితే అక్కడున్న రోడ్లు విశాలంగా లేవు. రోడ్ల కిరువైపులా ఉన్న కాలువల్లోని నీళ్ళు, వాటిపై స్వైర విహారం చేస్తున్న దోమల్ని చూశాక నేను ఒక నిర్ణయానికి రాలేకపోయాను.

## "అ" సెంటిమెంటు!

*ఆకాశ్ హీరోగా చేస్తున్న సినిమాకి ఆకాశం అని పేరు పెట్టారు కుమారస్వామి రెడ్డి. రోజా అన్నగా మాత్రమే ఇండస్ట్రీకి తెలిసిన కుమారస్వామి మొదట్లో ఏమో అనుకున్నా ఈ సినిమా టైటిల్‌తో తెలివైన వాడు అనిపించుకున్నాడు.*

*'ఆనందం' సినిమా హిట్ అయిన నేపథ్యంలో 'అ' సెంటిమెంట్ 'ఆకాశ్' సెంటిమెంట్ ప్లస్ అవుతాయని అనుకుంటున్నారంతా.*

*కుమారస్వామిరెడ్డి అదృష్టం ఎలావుందో ఏమో?*



'నచ్చక పోవడం కాదు, నాకు కొంచెం టైము కావాలి' రమణయ్యగారికి చెప్పి నేను కిందకు వచ్చాను. రమణయ్యగారు కూడా నాతోపాటు మెట్లు దిగి కిందకు వచ్చారు.

ఒకటి రెండు రోజుల్లో వచ్చి మళ్ళీ కలుస్తానని రమణయ్యగారికి చెప్పి నేను ముందుకు నడిచాను. పదడుగులు నడిచానో లేదో సాగర్ టవర్స్ పక్కనున్న ఇంటి నుంచి ఒక చక్కటి పాట వినిపించింది.. "మనసున మల్లెల మాలలూగెనే..." మల్లీశ్వరి చిత్రంలో భానుమతి పాడిన పాట చెవిని పడగానే నా అడుగు ముందుకు పడలేదు. అది రేడియో నుంచి గాని టీవీ నుంచి గాని ప్రసారమైన పాట కాదు. ఎవరో ఒక స్త్రీ ఆలాపిస్తోన్న పాట. మధురమైన కంఠం. ఏ వాయిద్యం లేకుండా ఎంతో శ్రావ్యంగా పాడే ఆ స్త్రీ ఎవరో?... ఎవర్నడిగితే తెలుస్తుంది?.... అడగటం ఏం బావుంటుంది?.... నేను వెనుదిరిగి సాగర్ టవర్స్ వైపు వెళ్ళాను, అపార్ట్‌మెంట్స్ నాలుగో అంతస్తుకు చేరగానే - ఏవిటీ వ్యక్తి మళ్ళీ వెనక్కు వచ్చాడు అన్నట్టు రమణయ్యగారు ఆశ్చర్యంగా నా వైపు చూశారు.

"చూడండి, రమణయ్యగారూ! మీకు పాటలంటే ఇష్టం లేదా?" అడిగాను.

"ఇష్టం లేదని ఎవరన్నారు?" ఎదురు ప్రశ్న వేశారు రమణయ్యగారు.

"ఎవరో అన్నారని కాదు - ఊరికే అడిగాను... అది సరే, ఇందాక మీరు చూపించిన పోర్షన్ అద్దెకు తీసుకోటానికి అంగీకరిస్తున్నాను."

"ఏవిటీ నీకు పాటలంటే అంత ఇష్టమా?"

"అలాగని మీరెలా ఊహించారు?"

"ఊహించడానికేముంది? - పాట వినగానే తీసుకున్న నీ నిర్ణయమే చెబుతుంది ఆ సంగతి".

"అవునండీ, యు ఆర్ కరెక్ట్... అది సరే, ఆ గాయని ఎవరు?" అడిగాను నేను.

"పక్కింట్లో ఉన్న ఆమె పేరు మీనా అని విన్నాను. కాని ఆమెను నేనింతవరకు చూడలేదు".

"అలాగా... సరే, మీరు చెప్పిన అడ్వాన్స్ ఇవ్వడానికి నేను సిద్ధమే... ఎప్పుడు నన్ను ఇంట్లో చేరమంటారు?"

"తొందరెందుకు? నువ్వు ఫ్యామిలీని తీసుకురావా?"

"నాకు ఫ్యామిలీగట్రా లేదు - నేను ఒంటరివాడ్ని పెళ్ళి చేసుకోలేదు."

"పెళ్ళి చేసుకోలేదా! - నీ వయస్సు?"

"నాకు పెళ్ళి వయస్సు ఎప్పుడో దాటిపోయింది. నేను పుట్టి మూడు పుష్కరాలు గడచిపోయాయి. నేను బ్యాచులర్ని, బ్యాచులర్స్‌కి అద్దెకివ్వటానికి అభ్యంతరమా?"

"నో-నో - అటువంటిదేం లేదు. అభ్యంతరం ఎందుకు? చూడు బాబూ, నేను అందరిలా ఆ షరతులు ఈ షరతులు పెట్టే మనిషిని కాదు. నువ్వు చదువుకున్నవాడివి. సంస్కారం ఉన్నట్టు నీ మాట తీరే చెబుతోంది. కాబట్టి నువ్వు ఎప్పుడు



## కొత్తలాజిక్కు!

*"చాలా మంది ఆడవాళ్ళలో ఇన్‌సెక్యూర్ ఫీలింగ్ చోటు చేసుకుంటుంది. అసలు ఆడవాళ్ళలో అభద్రతా భావం ఎందుకు చోటు చేసుకోవాలి? అదే నాకు అర్థం కాని విషయం. స్త్రీ బేలతనానికి శీలం అంటే... సెక్సువల్‌గా డిస్టర్బ్ అవడం ఒక్కటే ప్రధానమైందా? మిగతా హక్కులు అవసరం లేదా? నా దృష్టిలో ఆడది తన తప్పు లేకుండా శీలాన్ని కోల్పోతుంది. 'మనసు' ని కోల్పోదు కదా!" అంటోంది సీరియస్ ప్రీతిజింతా.*

రావాలనుకుంటే అప్పుడే వచ్చి ఇంట్లో చేరొచ్చు." అన్నారు రమణయ్యగారు నేనిచ్చిన అడ్వాన్సు తీసుకుంటూ.

సాగర్ టవర్స్ అపార్టుమెంట్‌కు మకాం మార్చి రెండు నెలలయింది. మార్నింగ్ వాక్‌కని బీచ్ రోడ్డుకు వెళ్ళినప్పుడు, పాలబూత్‌కెళ్ళి వచ్చేటప్పుడు కొత్త కొత్త వాళ్ళతో పరిచయం ఏర్పడింది. అంతా మీనా పాట విన్నవారే. ఆమె పాటలో మెలోడీ ఉందని ప్రశంసించినవారే. ప్రతి రోజూ సాయంత్రం ఆరు, ఏడుగంటల మధ్య మీనా తప్పనిసరిగా ఒక పాట పాడుతుంది. ఆమె పాట వినాలని నేను, ఎన్ని పనులున్నా వాటిని విడిచిపెట్టి, ఆఫీసునుంచి తిన్నగా ఇంటికి చేరుకుంటాను. అదే సమయానికి రమణయ్యగారు ఇల్లు చేరుకుంటారు. స్నానం చేసి అంగవస్త్రం కట్టుకుని ఆరుబయట గాలి కోసం టెర్రేసెక్కి పచార్లు మొదలుపెడతారు. నేను ఇంటికి వెళ్ళగానే రిఫ్రెషయి రమణయ్యగారి దగ్గరకు వెళతాను. నా రాకను గమనించి ఆయన వాకింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి నా పక్కన కూర్చొని లోకాభిరామాయణం మొదలుపెడతారు.

ఒకరోజు నేను ఇంటికి చేరేసరికి బాగా పొద్దుపోయింది. రిఫ్రెషయి టెర్రేస్ మీదకు వెళ్ళేసరికి రమణయ్యగారు నాకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఆ రోజు పౌర్ణమి. పిండారపోసినట్టుంది వెన్నెల. చల్లగా కనిపిస్తున్నాడు చంద్రుడు. రమణయ్యగారు నాకు కొంచెం దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చున్నారు - ఏదో రహస్యం చెప్పటానికుపక్రమించినట్టు. నేను మౌనంగా కుర్చీలో కూర్చున్నాను. ఆయన తలమీది వెంట్రుకలు తెల్లబడి ఎన్నాళ్ళయిందోకాని అవి పున్నమి వెన్నెల్లో వెండి తీగల్లా కనిపించాయి.

"చూడు రాజు" అని నావైపు తిరిగారు ఆయన. నా పేరది కాకపోయినా ముద్దుగా నన్ను రాజు అని పిలుస్తారు రమణయ్యగారు.

నేను ఆయన ముఖంలోకి చూశాను.

"ఈరోజు షిప్‌యార్డ్ క్వార్టర్స్ నుంచి మా అమ్మాయి రేణుక వచ్చి వెళ్ళింది" రమణయ్యగారు చెప్పారు.

అదేమంత ప్రత్యేకంగా చెప్పవలసిన వార్త కాదు. ఊళ్ళో ఉన్న అతని కూతురు వారానికో పదిరోజులకో ఒకసారి వచ్చి వెళుతుంది. అది మా అపార్టుమెంట్సులో ఉన్న వారందరికి తెలిసిన విషయమే.

"అలాగా..." అన్నాను నేను.

"మా మనవడు - అంటే మా రేణుక కొడుకు పుట్టినరోజు రేపు. నిన్ను నన్ను పార్టీకి ఆహ్వానించింది రేణుక.

ఇది మొదటి బర్త్‌డే. అందుకే నువ్వు రేపు సాయంత్రం మరేం ప్రోగ్రాం పెట్టుకోవద్దు."

"థాంక్యూ - మీరు రమ్మనటం, నేను కాదనడమా!... అలాగే వెళ్దాం".

"ఇంకో విశేషమేమిటంటే -'పక్కింటికి వెళ్ళి మీనాక్షి, వాళ్ళ అమ్మగారిని బర్త్‌డే పార్టీ కి ఆహ్వానించనా' అని అమ్మాయి అడిగింది. నేను సరేనన్నాను."

"రేణుకగారు వెళ్ళారా?" అడిగాను.

"ఆ, వెళ్ళి మీనా తల్లికి చెప్పింది. మీనా ఇంట్లో లేదట. రికార్డింగ్ ఉందని రేడియో స్టేషన్‌కు వెళ్ళినట్టు మా రేణుక చెప్పింది?" అన్నారు రమణయ్యగారు.

"అలాగా... అయితే మీనా పాటలు రేడియోలో కూడా వస్తుంటాయన్నమాట" అన్నాను నేను.

"అంతేగా మరి - అందువల్లనే అనుకుంటా సాయంత్రం ఆమె పాట వినబడలేదు." అన్నారు రమణయ్యగారు.

"రికార్డింగ్ కోసం రేడియో స్టేషన్ వరకు వెళ్ళిన మీనాగారు ఇంటి గుమ్మం దాటి బాల్కనిలోకి గాని, వరండా వైపు గాని రావటం నేనింతవరకు చూడలేదు."

"అవును, నేను చూడలేదు. అయితే ఆమె బయటకు రాకపోటానికి కారణం లేకపోలేదు. మూడ్నెల్ల క్రిందట, అంటే నువ్వు ఈ ఫ్లాట్‌కి రాకముందు, ఏదో సందర్భంలో వాళ్ళింటికి వెళ్ళినప్పుడు రేణుక మీనాను చూసిందట. ఆ విషయం ఎందుకో మన సంభాషణలోకి రాలేదు. మధుర గాయని మీనాకు పాపం దృష్టి కరువైందట. పుట్టుకతో వచ్చిన లోపమా అంటే అదీ కాదు. అత్తవారింట్లో ఆమె ఎన్నో కష్టాలు పడిందని, పెళ్ళయిన పదినెలలకే మీనా పసుపు కుంకానికి దూరం అవడంతో ఆమెను ఒక శనిగ్రహంలా చూసేవారని, సజీవ దహనం చేయటానికి అత్తవారింట్లో అంతా పూనుకొనగా అదృష్టవశాత్తు మంటల బారి నుండి తప్పించుకుని ప్రాణాలతో బయటపడిందని, దాని ఫలితంగా ఆమె దృష్టిని పోగొట్టుకున్నట్టు రేణుకకు తెలిసింది. అప్పటి నుంచి మీనా తల్లి దగ్గరే ఉండి సంగీత సాధన చేస్తున్నట్టు రేణుకకు మీనా తల్లి చెప్పిందట" అన్నారు రమణయ్యగారు.

"మీనా వెనుక ఇంత విషాదగాథ ఉందా!" అన్నాను నేను ఆశ్చర్యంగా.

"కష్టాల్ని ఎదుర్కొని ముందుకు వెళ్ళినవారే గొప్ప కళాకారులౌతారేమో!... అది సరే, నువ్వు ఎన్నో సంగతులు చెబుతుంటావు, ఎన్నో విషయాలు నన్నడిగి తెలుసుకుంటావు కానీ నీ అసలు విషయం చెప్పవేం రాజూ!" అన్నారు రమణయ్యగారు.


"అదేవిటి?" ఆశ్చర్యంగా చూశాను ఆయన ముఖంలోకి.

"అదేనోయ్ - నీ పెళ్ళి విషయం. నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు? - పిల్ల దొరకలేదా?... అసలు పెళ్ళే వద్దనుకున్నావా?"

"పిల్లలు దొరక్కకాదు, పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశం లేక"

"అదే - ఉద్దేశం ఎందుకులేదూ అని అడుగుతున్నాను."

రెండు నెలల పరిచయంలోనే రమణయ్యగారు, నేను చాలా సన్నిహితులమైపోయాం. నాకు ఆయనకు వయసులో చాలా తేడా ఉన్నా రమణయ్యగారు నాకు స్నేహితుడు, గురువు, తండ్రి అన్నీ ఆయనే... అందుకు వ్యక్తిగత విషయమైన నా పెళ్ళి గురించి ఆయన అడిగినందుకు నేను ఆనందించానే తప్ప



## 'ముద్దు' లో తప్పేముంది?

*"నేను కమల్‌తో నటించడానికి చాలా ఇష్టపడతాను. కమల్‌కి ముద్దుల పిచ్చి అంటారు. ఇందులో పిచ్చి అనడానికి ఏముంటుంది? అది గొప్ప రొమేంటిక్ ఎక్స్‌ప్రెషన్. ప్రేయసీ ప్రియుల మధ్య ఉన్న డీప్ ఇంటిమెసీని వ్యక్త పరచడానికి ముద్దుని మించిన ఆయుధం లేదు. కమల్ ముద్దు పెడుతుంటే ఎక్కడా అసభ్యంగా ఉండదు. అసలు ముద్దులో తప్పేముంది? అనిపిస్తుంది. అంటోంది మనీషా!"*

*(అదే.. ఏ కమేడియన్నో ముద్దు పెడితే... ఈ ఫీలింగ్ కలుగుతుందా?)*

మరోలా అనుకోలేదు.

"ఏమిటీ పెళ్ళి గురించి అడిగితే అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్ - నీ పర్సనల్ విషయం గురించి అడిగానని నువ్వు బాధపడుతున్నావా?"

"నో - నో - అలాంటిదేమీ లేదు.. ఇంతవరకూ అవకాశం రాలేదు కాబట్టి నేను ఆ విషయం మీకు చెప్పలేదు. నాగురించి మీరు యీ సరికి తెలుసుకునే ఉంటారు. అనుకున్నది జరగకపోతే నేను తట్టుకోలేను. ఎందుకు సాధించలేకపోయానా అని నేను తరచు బాధపడుతుంటాను. పదిహేను సంవత్సరాల క్రిందట నా తల్లి శాశ్వతంగా కన్నుమూసింది. అప్పటికి నా వయస్సు యిరవై నాలుగు సంవత్సరాలు. మా నాన్నగారు నా చిన్నతనంలోనే పరమపదించడంతో తల్లిగారి దశదినకర్మ రోజున అన్ని పనులు నేనొక్కడినే దగ్గరుండి చూసుకోవలసి వచ్చింది. ఆ రోజున పై ఊర్ల నుంచి బళ్ళు కట్టించుకుని చాలా మంది వచ్చారు. అయితే ఇంటి పనులు చేయటానికి ముగ్గురు నలుగురు తప్ప మరెవరూ ముందుకు రాలేదు. ఇదేవిటీ రాజు పెళ్ళి గురించి అడిగితే తల్లి పెద్దదినం గురించి చెబుతున్నాడని మీరనుకోవచ్చు. మీరడిగిన ప్రశ్నకు మా తల్లి దశదినకర్మకు సంబంధం ఉంది కనక ఆ విషయం గురించి చెప్పక తప్పలేదు. ఆరోజు ముందుకు వచ్చి, ఎక్కువ శ్రమ తీసుకుని అన్ని పనుల్లోనూ సహాయపడిన వ్యక్తి పెళ్ళికాని ఒక అమ్మాయి. ఆమె వయసు ఇరవైకి మించి ఉండదు. ఆమె ఎవరో నాకు తెలీదు. ఏ ఊరు నుంచి వచ్చిందో ఎవరూ నాకు చెప్పలేదు. చక్కటి మొహం, చక్రాల్లాంటి కళ్ళు, వయసుకు తగిన ఎత్తు, మేలిమి బంగారపు ఛాయ. మా అమ్మను పై లోకాలకు తీసుకెళ్ళిన ఆ భగవంతుడే ఆ అమ్మాయిని మా యింటికి పంపించాడా అని తలచాను. పెళ్ళి చేసుకుంటే ఆమెనే పెళ్ళి చేసుకోవాలన్న ఒక నిర్ణయానికి నేనొచ్చాను. దశదినకర్మ హడావిడిలో ఆమె పేరు, ఊరు ఎవర్నీ అడగలేదు. ఆ వివరాలు అడిగే టైము అది కాదని ఊరుకున్నాను. అయితే ఆ మర్నాడు ఆమె నాకంటికి కనిపించలేదు. ఎక్కడికి వెళ్ళిందో, ఏ ఊరు వెళ్ళిందో.... ఇప్పటికీ ఆమె ఆచూకీ నాకు తెలియలేదు. అప్పటి నుంచి నేను ఆమెను తలచుకోని రోజు లేదు. నేను పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారిగా జీవితం గడపటానికి కారణం ఇంతకంటే మరేమీ లేదు." చెప్పాను నేను.

"బాధపడకు రాజా! మనం ఎన్నో ఆశలు పెట్టుకుంటాం, ఎన్నో ఊహించుకుంటాం. మనం అనుకున్నట్టే అన్నీ జరిగితే మనం మానవులుగా పుట్టకపోదుము. నడిపించేవాడు పైనున్నాడు. ఇది దేవుని చదరంగం.." అన్నారు రమణయ్యగారు, కుర్చీ నుండి లేస్తూ.

అప్పటికే చాలా పొద్దుపోయింది. రమణయ్యగారు మెట్లవైపు నడిచారు, మా ఫ్లోరుకు వెళ్ళడానికి. ఆయన్ని నేను అనుసరించాను.

సమయం మధ్యాహ్నం రెండు గంటలు. ఆఫీసులో ఉన్న నేను అర్జంటు పేపర్స్ చూస్తున్నాను. ఫోన్ రింగయింది. రిసీవర్ చెవి దగ్గర పెట్టుకోగానే రమణయ్యగారి గొంతు వినిపించింది. ఆయన చాలా హడావిడిగా మాట్లాడు తున్నట్టనిపించింది.

"ఏమైంది సార్" అన్నాను నేను.

"చెప్పటానికి టైమ్ లేదు. నువ్వు వెంటనే ఉన్నఫళంగా రావాలి - వెరీ అర్జంట్" అని ఫోను పెట్టేసారాయన.

స్టాండ్‌లో ఉన్న స్కూటర్ని తీసి పది నిముషాల్లో సాగర్ టవర్స్ చేరుకున్నాను. రమణయ్యగారు కాంపౌండ్ గేటు దగ్గర నిలబడి ఉన్నారు, నా రాకకోసం ఎదురుచూస్తూ. స్కూటర్ని పక్కన పెట్టి రమణయ్యగారి దగ్గరకెళ్ళాను. ఆయన నా భుజం మీద చేయవేసి నాలుగడుగులు ముందుకు తీసుకెళ్ళి మెల్లగా చెప్పారు -

."చూడు రాజా! నాలుగు రోజుల క్రిందట మీనా ప్రోగ్రామ్‌కి వెళ్ళినట్టు మా రేణుక ద్వారా తెలిసిన విషయం నీకు చెప్పాను. ఆరోజు ఆమె రికార్డింగ్ రేడియో స్టేషన్‌కని బయల్దేరిన మాట వాస్తవమే. అయితే దార్లో హార్టెటాక్ రావడంతో అదే ఆటోలో తీసుకెళ్ళి మీనాను ఒక పెద్ద ఆసుపత్రిలో చేర్పించారట. నిన్నటివరకు బాగానే ఉందట. అయితే దురదృష్టవశాత్తు సెకెండ్ అటాక్ రావటంతో మీనా యీరోజు మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతాన ప్రాణాలు విడిచింది... ఆమె తల్లి తప్ప అక్కడ ఎవరూ లేరు. మన అపార్ట్‌మెంట్స్‌లో ఉన్నవాళ్ళు చాలామంది ఆఫీసులకెళ్ళిపోయారు. దహనక్రియలు అయిదు గంటలలోపున జరగాలని పంతులుగారు చెప్పారు. నాకు తెలిసిన ఒక వ్యక్తిని బరియల్ గ్రౌండ్‌కు పంపి అక్కడ కావలసిన ఏర్పాట్లు అవీ చూడమన్నాను." రమణయ్యగారు చెప్పారు.

మీనా మరణవార్త చెవిని పడగానే, ప్రమాదావశాత్తు నీటి నుండి ఎగిరి ఒడ్డున పడ్డ చేపపిల్లలా నా మనస్సు విలివిలలాడిపోయింది. తన గానంతో నాలాంటి శ్రోతల మనస్సును రంజింపజేసే ఒక మధురగాయని ఇప్పుడు లేదు అని తలచుకోగానే నాకు తెలియకుండా నా కళ్ళు వర్షించాయి.

నాలుగు గంటలకు ముందే శాస్త్రోక్తంగా జరగ వలసిన తతంగం పూర్తి కావొచ్చింది. ఒక్కొక్కరు పాడె దగ్గరకు వెళ్ళి అంతిమదర్శనం చేసుకుని మృతదేహం మీద పువ్వులు ఉంచి వస్తున్నారు. నేను దగ్గరకు వెళ్ళి మీనా మొహంలోకి చూశాను- నా మనస్సు పదిహేను సంవత్సరాల వెనక్కు పరుగెత్తింది. మా అమ్మ దశదిన కర్మరోజు చలా కీగా ముందుకు వచ్చి శ్రమ అనుకోకుండా అన్ని పనుల్లోనూ సహాయపడ్డ ఆ అమ్మాయిని ఇలా చూడాల్సి వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. కోరుకున్న సుందరి పక్కింట్లో ఉన్నా బ్రతికుండగా ఆమెను కలుసుకోలేకపోయిన దురదృష్టవంతుణ్ని నేను. నా మనోవేదనను ఎవరికి చెప్పుకోగలను?... మీనా శరీరం మీద దోసిలి పూలు వేసి కడసారి చూపైనా దక్కిందన్న తృప్తితో వెనక్కు తిరిగి వస్తుండగా, పాడె ఎత్తడానికి ఒక మనిషి తక్కువ యారని ఎవరో అనటం విన్నాను. వెంటనే నేను పాడె దగ్గరకెళ్ళి ఒక మూల నిలబడి, కట్టెను భుజంపై వేసుకోగానే మీనా అంతిమయాత్ర ముం దుకు సాగింది. 'ఈ జీవన తరంగాలలో ... ఆ దేవుని చదరంగంలో..' అన్న పాటను ఎందుకో ఆ క్షణాన నేను తలచుకోకుండా ఉండలేకపోయాను.

❋

## జీసస్! మళ్ళీ జన్మించు!

జీసస్! మళ్ళీ జన్మించు!
మూసుకుపోయిన జగతి కళ్ళు
తెరిపించు!
మతోన్మాదులకర్కశ హృదయాలను
నీదయార్ద్ర శక్తితో కరగించు!
ఉగ్రవాద ఉన్మాదుల
అంతరంగంలో ఆవిర్భవించు!
భయానక రక్తసిక్త క్షేత్రంలో
విశ్వశాంతి సుధలు కురిపించు!
ద్వేషామయ విషపూరి
తజనారణ్యంలో
ప్రేమబీజాలు మొలిపించు!
జగతి 'గతి' ని మళ్ళించు!
ప్రగతి పథంలో నడిపించు!
అందుకే జీసస్! మళ్ళీ జన్మించు!

- ద్వారకానాథ్